



ఒక్క అవకాశం..

- మంత్రివర్గంలో స్థానం కోసం ముమ్మర ప్రయత్నాలు
- రేస్‌లో బండారు సత్యానందరావు, అయితాబత్తుల
- క్షత్రియ కోటాలో బుచ్చిబాబు, సీనియర్‌గా వేగుళ్ల
- అమరావతిలో ప్రయత్నాలు ముమ్మరం చేసిన పార్టీ నేతలు
- కేంద్రంలో స్థానం కోసం ఎంపీ హరీష్ ప్రయత్నాలు
- కోనసీమకు రెండు మంత్రి పదవులు దక్కే అవకాశం?
- జనసేనలోనూ అదే ప్రయత్నంలో ఆశావహులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రెండేళ్ల కిందట ఆవిర్భవించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి క్లీన్‌స్వీప్ చేయడంతో గెలిచిన విజేతలు మంత్రివర్గంలో స్థానాలకోసం ఉవ్విళ్లూరుతున్నారు. ఇప్పటికే కొందరు విజేతలు ఎవరి ప్రయత్నాలు వారు ముమ్మరం చేశారు. అమరావతి రాజధానిలో మకాంవేసి మరికొన్ని రోజుల్లో కొలువు తీరనున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు మంత్రివర్గంలో స్థానాలను కైవసం చేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. కొందరు కీలక నేతల సహకారంతో చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లపై ఒత్తిడి ప్రారంభించారు. కోనసీమ జిల్లాలో ఎస్సీ రిజర్వుడు లోక్‌సభ నియోజకవర్గమైన అమలాపురం నుంచి దివంగత నేత బాలయోగి తనయుడు గంటి హరీష్‌మాధుర్ అత్యధిక మెజార్టీతో టీడీపీ నుంచి లోక్‌సభకు విజేతగా గెలిచారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న హరీష్‌మాధుర్ తన అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో బిజీగా ఉన్నారు. తన తండ్రి బాలయోగి పేరు ప్రఖ్యాతలు దృష్ట్యా ఎన్డీఏ కూటమిలో కీలక పదవి పొందేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఎస్సీ రిజర్వుడు లోక్‌సభ నుంచి ఎన్నికైన హరీష్‌మాధుర్ పేరును బీజేపీ ప్రభుత్వం పరిశీలనలోకి తీసుకునే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇక కోనసీమలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో రాజోలు, పి.గన్నవరం స్థానాల్లో జనసేన, మిగిలిన ఐదు స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు విజయకేతనం ఎగరువేశారు. ఈ నేపథ్యంలో కోనసీమలోని అత్యంత సీనియర్‌గా పేరొంది ఎనిమిదోసారి సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించిన కొత్తపేట ఎమ్మెల్యే విజేత బండారు సత్యానందరావుకు చంద్రబాబు మంత్రివర్గంలో చాన్స్ దక్కే అవకాశాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. జిల్లాలో సీనియర్లలో ఒకరిగా పేరొందిన బండారుకు ఈసారి మంత్రివర్గంలో స్థానం లభిస్తుందనే ధీమాను నియోజకవర్గంలోని ఓటర్లు సైతం వ్యక్తంచేస్తున్నారు. ఎట్టిపరిస్థితుల్లోను బండారుకు కేబినేట్‌లో స్థానం కల్పించాలని పట్టుబడుతున్నారు. ఇక ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గం నుంచి అమలాపురం నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలుపొందిన అయితాబత్తుల ఆనందరావు పేరును ఎస్సీ కోటా టీడీపీ-జనసేన అధిష్ఠానం పరిగణలోకి తీసుకునే అవకాశాలు కూడా ఉన్నాయి. మూడు ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో రెండు స్థానాలు జనసేనకు కేటాయించగా గెలిచిన ఏకైక స్థానం నుంచి టీడీపీ విజేత ఆనందరావుకు ఆ పార్టీ మంత్రివర్గంలో స్థానం కల్పించవచ్చని జోరుగా ప్రచారం జరుగుతుంది. ఇక క్షత్రియుల కోటాలో దాట్ల బుచ్చిబాబుతోపాటు మండపేట నుంచి వరుస విజయాలు సాధిస్తున్న సీనియర్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్లను టీడీపీ అధిష్ఠానం పరిశీలనలోకి తీసుకుంటుందని ఆయా నియోజకవర్గాల్లో ఓటర్లు ఆకాంక్షిస్తున్నారు. జనసేన నుంచి ఎన్నికైన సీనియర్ ఐఏఎస్ అధికారి, రాజోలు విజేత దేవ వరప్రసాద్, పి.గన్నవరం నుంచి ఎన్నికైన పోలీసు అధికారి గిడ్డి సత్యనారాయణల్లో ఒకరికి కీలక పదవి లభించవచ్చని ప్రచారమైతే జరుగుతోంది. ఇలా కోనసీమలో సీనియర్లు విజేతలు కావడంతో పార్టీ అధిష్ఠానాలకు పెద్ద తలనొప్పిగానే పరిణమించింది. ఎట్టి పరిస్థితుల్లోను కోనసీమ జిల్లాకు రెండు మంత్రి పదవులు దక్కవచ్చనే ఊహాగానాలైతే వ్యక్తమవుతున్నాయి.



అమరావతిలో లోకేశ్‌కు పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలుపుతున్న దాట్ల సుబ్బరాజు

లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే విజేత దాట్ల

మంత్రి పదవి అవకాశం ఇవ్వాలని వినతి

ముమ్మిడివరం, జూన్ 7: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే విజేత దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని ఆయన నివాస గృహంలో శుక్రవారం కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి అధిక మెజార్టీతో ఘన విజయం సాధించిన సుబ్బరాజును లోకేశ్ కూడా అభినందించారు. నియోజకవర్గంలోని పరిస్థితులు, ఇతర అంశాలపై లోకేశ్‌తో దాట్ల చర్చించారు. క్షత్రియ సామాజికవర్గ కోటా కింద తనకు మంత్రి పదవి కేటాయించాలనే అభ్యర్థనను లోకేశ్ ముందు ఉంచినట్టు సమాచారం.

ఓటెత్తిన యువతరం.. కూటమికే పట్టం!



- వైసీపీ ప్రభుత్వంలో యువతకు రిక్తహస్తం
- ఉన్నత చదువులు పూర్తిచేసినా జాబ్ లేదు
- జాబ్ క్యాలెండర్ అని చెప్పి చివరకు మోసం
- ఉద్యోగాలు లేక ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు..
- ఓటుతో బుద్ధి చెప్పడానికి తరలివచ్చిన యువజనం
- భారీగా పోలింగ్ పెరగడంలో వీరిదే ముఖ్యపాత్ర

(అమలాపురం టౌన్)

ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఒక్క ఏడాది కూడా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయలేదు. వేలాదిగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నా పట్టించుకోలేదు. రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు సైతం లేకుండాపోయింది. ఉన్నత చదువులు పూర్తిచేసినా ఉద్యోగ అవకాశాలేక ఎందరో యువత పక్క రాష్ట్రాలకు ఉపాధి కోసం వలసలు వెళ్లిపోయారు. జగన్ ఐదేళ్ల పాలనలో జిల్లాలోని యువత మానసిక క్షోభ అనుభవించింది. తల్లిదండ్రులకు భారమై ఉండలేక, ఉన్నత విద్యావంతులైన వారు దూర ప్రాంతాలకు వెళ్లి పొట్ట పోసుకోవాల్సిన పరిస్థితి తీసుకువచ్చారు. పాలకుల తీరులో మార్పురావాలని యువత బలంగా కోరుకుంది. దేశం నలుమూలలా ప్రధాన పట్టణాలకు వలసలు వెళ్లిన నిరుద్యోగులంతా దూరాభారాలను సైతం లెక్క చేయకుండా ఓట్లు వేసేందుకు ముందుకు వచ్చారు. మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలకు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు వేలాది మంది యువకులు తరలివచ్చారు. తమలా మరెవ్వరూ బాధపడకూడదని ఓట్లు వేశారు. ఇంజనీరింగ్‌తో పాటు ఇతర చదువులు చదువుకుంటున్న విద్యార్థులకు ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌లు చెల్లించకపోవడంతో తరగతి గదుల్లో మనోవేదన అనుభవించినవారు ఎందరో. ఇటువంటి వారంతా తొలిసారి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం రావడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే ప్రభుత్వం రావాలని కోరుకుంటూ బహిరంగ ప్రకటనలు చేస్తూనే ఓట్లు వేశారంటే యువతరం ఏ స్థాయిలో మార్పును కోరుకుందో అర్థమవుతుంది. ఇంజనీరింగ్ చివరి సంవత్సరం పూర్తిచేసిన విద్యార్థులకు ఏడాదికాలంపాటు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ జగన్ ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో సర్టిఫికెట్లకోసం అప్పులు చేసి తల్లిదండ్రులు ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి సైతం ఓటు రూపంలోనే బహిరంగపరిచారు. ఉన్నత విద్యకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను లేకుండా చేసిన జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం జరిగిందని యువత ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో 90 శాతం యువతరం ఓట్లు కూటమి అభ్యర్థులకే వెళ్లాయని రాజకీయ విశ్లేషకులు అంచనాలు వేస్తున్నారు. జిల్లాలో తొలిసారిగా 36 వేల మంది యువత ఓటుహక్కును వినియోగించుకున్నారు. 20 నుంచి 29 ఏళ్లలోపు యువత 2,57,072 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక 30 నుంచి 39 ఏళ్లలోపువారితో కలిపి జిల్లాలో 6,97,801 మంది యువత ఓటు హక్కును వినియోగించుకుని కూటమికి అండగా నిలిచారని ఓట్ల శాతమే పక్కాగా లెక్కలు చెబుతున్నాయి. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో తొలిసారి 4,543 మంది ఓటుహక్కును వినియోగించుకోగా 29 ఏళ్లలోపువారు 34,984 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ముమ్మిడివరంలో తొలిసారి 5,688 మంది, 29 ఏళ్లలోపు యువత 42,156 మంది ఓటేశారు. రామచంద్రపురంలో 4,723 మంది తొలిసారి, 29 ఏళ్లలోపు యువత 33,434 మంది ఓటేశారు. రాజోలులో 4,514 మంది తొలిసారి, 29ఏళ్లలోపువారు 32,209 మంది ఓటేశారు. పి.గన్నవరంలో 4,495 మంది తొలిసారి, 29 ఏళ్లలోపువారు 32,502 మంది ఓటేశారు. కొత్తపేటలో 6,380 మంది తొలిసారి, 29 ఏళ్లలోపువారు 42,370 మంది ఓటేశారు. మండపేటలో 5,657 మంది తొలిసారి, 29 ఏళ్లలోపువారు 39,417 మంది ఓటేశారు. కొత్త ఓటర్లలో మెజారిటీ కూటమికే ఓటేశారని పెరిగిన ఓటింగ్ శాతమే చెబుతోందని విశ్లేషకులు సైతం తేల్చేశారు.



పార్లమెంటేరియన్..

ఎన్డీఏ ప్రభుత్వం ఈనెల 9న ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో అమలాపురం లోక్‌సభ విజేత గంటి హరీష్‌మాధుర్ ఢిల్లీకి చేరుకుని టీడీపీ అధినేత చంద్రబాబుతో భేటీ అయ్యారు. అనంతరం పార్లమెంటేరియన్‌గా త్వరలో అడుగుపెట్టనున్న పార్లమెంటు భవనం ఎదుట హరీష్‌మాధుర్.

- అమలాపురం టౌన్

డిపాజిట్లూ గల్లంతే..



- కూటమి, వైసీపీ అభ్యర్థుల మధ్యే పోటీ
- ఏడు నియోజకవర్గాల్లో 106 మంది పోటీ.. 90 మందికి డిపాజిట్లూ దక్కలేదు
- లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థికి మాత్రం 15,070 ఓట్లు
- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడికి 1,484 ఓట్లు

అమలాపురం టౌన్, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు 90 శాతం మంది డిపాజిట్లు కోల్పోయారు. జిల్లాలో కూటమి తరపున టీడీపీ-జనసేన, వైసీపీ అభ్యర్థుల మధ్యే పోటీ జరిగింది. వారికి దరిదాపుల్లో కూడా జిల్లా నుంచి ఏ ఒక్క అభ్యర్థి రాలేకపోయారు. ప్రతీ నియోజకవర్గంలో పోటీ పడ్డ ప్రధాన పార్టీల ఆ ఇద్దరు అభ్యర్థులు మినహా బరిలో నిలిచిన మిగిలిన అభ్యర్థులందరూ డిపాజిట్లు కోల్పోయారు. సార్వత్రిక ఎన్నికల్లో కొందరు అభ్యర్థులైతే ప్రత్యేక వాహనాలు పెట్టి మరీ విస్తృత ప్రచారమే నిర్వహించారు. అందుకు ఎన్నో రాజకీయ కారణాలు సైతం ఉన్నాయి. ప్రచారం వెనుక వారి లక్ష్యం ఓట్లు చీల్చడమే. అలా చేసినా కూడా ఆయా అభ్యర్థులకు కనీస ఓట్లు పోలవ్వలేదు. దాంతో డిపాజిట్లు కోల్పోయారు. జిల్లాలో లోక్‌సభ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 106 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వారిలో 90 మంది డిపాజిట్లు కోల్పోయారు. సార్వత్రిక ఎన్నికల్లో లోక్‌సభ ఎస్సీ రిజర్వుడు స్థానానికి రూ.12,500 డిపాజిట్ చెల్లించాలి. అసెంబ్లీ నియోజకవర్గాలకైతే జనరల్ అభ్యర్థులు రూ.10వేలు, రిజర్వుడు అభ్యర్థులు రూ.5వేలు డిపాజిట్‌గా చెల్లించారు. పోటీచేసిన 106 మందిలో 72 మంది అభ్యర్థులు డబుల్ డిజిట్ ఓట్లు మాత్రమే దక్కించుకోగా మరికొందరు త్రిబుల్ డిజిట్ ఓట్లు పొందారు. అమలాపురం లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ పోటీ చేయగా 15,070 ఓట్లు దక్కించుకున్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు మండపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీచేసి కేవలం 1484 ఓట్లు మాత్రమే పొంది వారిద్దరూ డిపాజిట్లు కోల్పోయారు. జాతీయపార్టీలైన కాంగ్రెస్, బీఎస్పీల తరుపున జిల్లాలో పోటీచేసిన అభ్యర్థులకూ డిపాజిట్లు దక్కలేదు. అమలాపురం లోక్‌సభ స్థానం నుంచి 15 మంది పోటీపడగా టీడీపీ, వైసీపీ అభ్యర్థులు మినహా 13 మంది డిపాజిట్లు కోల్పోయారు. అమలాపురం, రామచంద్రపురం, కొత్తపేట, ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 13 మంది చొప్పున అభ్యర్థులు బరిలో నిలవగా టీడీపీ, వైసీపీ అభ్యర్థులు మినహా మిగిలిన 44 మంది డిపాజిట్లు కోల్పోయారు. ముమ్మిడివరంలో 15 మంది పోటీచేయగా 13 మందికి, రాజోలులో 10 మంది పోటీచేయగా 8 మందికి, పి.గన్నవరంలో 14 మంది పోటీ చేయగా 12 మందికి డిపాజిట్ దక్కలేదు.





అమలాపురం ఎన్టీఆర్ మార్గ్‌లో ముఖ్యమంత్రి జగన్ వస్తున్నారని తొలగించిన వృక్షాలు (ఫైల్‌ఫొటోలు)

హమ్మయ్య.. బతికిపోయాయి!

- జగన్ వస్తున్నారంటే చెట్లకు మూడినట్టే.. ఎక్కడికక్కడ పర్యావరణానికి తూట్లు
- ఇప్పుడు పరదాలు, చెట్లను తొలగించే గోల లేదంటూ చర్చ

అమలాపురం టౌన్, జూన్ 7: పచ్చదనంతో పర్యావరణాన్ని కాపాడుకోవాలని అప్పట్లో జగన్ హిత బోధలు చేసేవారు. కానీ ఆయన వస్తున్నారంటే చాలు కనుచూపు మేర పచ్చదనం లేకుండా పోయేది. పర్యావరణ హితం కోరేవారు ఎంత మొత్తుకున్నా పట్టించుకున్నవారే లేరు. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం చెందడంతో చెట్లు ఊపిరిపీల్చుకున్నట్టు అయింది. 2019లో జగన్ సీఎం అయ్యింది మొదలు ఆయన రోడ్డు మీదకు వస్తుంటే కనుచూపు మేరలో పచ్చదనం లేకుండా పచ్చని చెట్లను నరికేసేవారు. దారి పొడవునా వందలాది చెట్లు నేలకొరిగిపోయేవి. ఎందుకు నరుకుతున్నారో తెలిసేది కాదు. భద్రతా కారణాల రీత్యా అన్నట్టు అధికారగణం చెబుతుండేది. చెట్లు నాటాల్సిన పాలకులే ఇలా ఎదిగిన చెట్లను నరికేయడం ఏమిటని ప్రశ్నించినా ఎవరూ పట్టించుకోలేదు. జగన్ పదవిలో ఉన్నంత కాలం వృక్ష విలాపమే. ఇప్పుడు చంద్రబాబు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తోందని తెలియగానే ఇక మొక్కలకు రక్షణ దొరికినట్టే అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. చెట్లు తొలగించిన చోట కనీసం కొత్త మొక్కలు నాటిన దాఖలాలు కూడా లేవని వారు వాపోయారు. ఇకపై సీఎం వస్తున్నారంటే దుకాణాల బంద్‌లు ఉండవు. రోడ్లకు ఇరువైపులా బారికేడ్లు ఉండవు. పరదాల గోల అంతకంటే ఉండదు. ముఖ్యంగా పర్యావరణ విధ్వంసం ఆగిపోయిందని ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు.



రోడ్లు ధ్వంసంతో వాహన చోదకుల పాట్లు

మట్టి అక్రమ తరలింపుతో ఛిద్రమైన రహదారులు

ద్రాక్షారామ, జూన్7: రామచంద్రపురం మండలం యనమదల గ్రామంలో అక్రమ మట్టి తవ్వకాలు నిరాటంకంగా సాగుతున్నాయి. మట్టిమాఫియాకు స్థానిక నాయకులు మొదలుకుని నియోజకవర్గ ప్రజాప్రతినిధుల దాకా అండ ఉండడంతో అడ్డూఅదుపూ లేకుండాపోయింది. దీంతో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. యనమదల గ్రామం నుంచి రామచంద్రపురం రోడ్డు, నరసాపురపుపేట రోడ్లలో ఉన్న వంతెనలు సైతం ఈ వాహనాల రాకపోకలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా నెలరోజులుగా మట్టి యథేచ్ఛగా తరలించడంతో రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. మట్టి తరలింపు సమయంలో వాహనాల నుంచి మట్టి రోడ్లు పొడవునా జారిపడింది. రెండురోజులుగా వర్షాలు కురవడంతో రోడ్లు మట్టితో ఛిద్రంగా మారాయి. దీంతో సైకిళ్లు, ద్విచక్రవాహనాల ప్రయాణానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. వాహన చోదకులు జారిపడుతున్నారు. యనమదల నుంచి రామచంద్రపురం రావాలంటే వాహనచోదకులు హడలిపోతున్నారు. గత వేసవి అనంతరం ఇదే దుస్థితి తలెత్తింది. అప్పట్లో విద్యార్థులు సైకిళ్లపై పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి దాపురించింది. ఈ ఏడాది కూడా ఇదే దుస్థితి ఉంది. గతంలో ప్రజాప్రతినిధుల అండదండలతో సాగిన మట్టి దందా ఈ ఏడాది కూడా కొనసాగుతోంది. ఇటీవల వైసీపీ అధికారం కోల్పోయినా ఆ నేతల అక్రమదందా మాత్రం కొనసాగుతోంది. గ్రామానికి చెందిన పలువురు తహశీల్దార్, వీఆర్వోలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మట్టి మాఫియాను అరికట్టి రోడ్లను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



మండపేటలోని టిడ్కో గృహ సముదాయంలో అధికారులు, లబ్ధిదారులతో మాట్లాడుతున్న జోగేశ్వరరావు


టిడ్కో ఇళ్లకు వసతుల కల్పనలో వైసీపీ వైఫల్యం : వేగుళ్ల

మండపేట,జూన్7: మండపేట పట్టణంలో టీడీపీ హయాంలో గొల్లపుంతకాలనీలో నిర్మించిన అపార్ట్‌మెంట్లకు కనీస వసతులు కల్పించడంలో అయిదేళ్లపాటు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. పట్టణంలోని గొల్లపుంతకాలనీని ఆయన శుక్రవారం సందర్శించి అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న కాలనీవాసుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెలకల్లా పూర్తిస్థాయిలో టిడ్కో గృహాలను అందరికీ అందించడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు ఇళ్లను అందించి ఏడాదిన్నర కావస్తున్నప్పటికీ నేటివరకు కనీస వసతులు కల్పించకపోవడం దారుణమన్నారు. భవిష్యత్‌లో అలాంటి తప్పిదాలు ఇక జరగకుండా చూస్తానని ఆయన చెప్పారు. అపార్ట్‌మెంట్లలో కమిటీల నియామకం, అపార్ట్‌మెంట్‌ల చుట్టూ ఉండే చెత్త, పిచ్చిమొక్కలను మున్సిపాల్టీ తొలగిస్తుందన్నారు. ఈ పనులు సోమవారం నుంచి ప్రారంభించడం జరుగుతుందన్నారు. కాలనీవాసులంతా సంఘటితంగా ఉంటూ ఫ్లాట్‌ల చుట్టూ ఉద్యాన పంటలు వేసుకుని లబ్ధి పొందాలన్నారు. అలాగే ఫ్లాట్ల చుట్టూ మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని చెప్పారు. విద్యుత్ సమస్యను కూడా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన టిడ్కో, మున్సిపల్‌శాఖాధికారులతో కాలనీలో సమస్యల గురించి చర్చించి తీసుకోవాల్సిన చర్యల గురించి మాట్లాడారు. ఏడాదిన్నర కిందట 3 వేల ఫ్లాట్లు ఇచ్చారని, వీటన్నింటికీ కమిటీలు ఏర్పాటుచేసుకోవాలని ఆయన సూచించారు. భవనం చుట్టూ బాగుచేసుకునేందుకు ఈ కమిటీలు చొరవ చూపాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థను చక్కదిద్దే పని మున్సిపాలిటీ చూస్తుందని, ఖాళీ స్థలాల్లో ఉద్యాన పంటలు సాగు చేసుకోవాలని చెప్పారు. సోమవారం నుంచి టిడ్కో ఆవరణలో పనులు ప్రారంభిస్తామని వేగుళ్ల అన్నారు. త్వరలో ఫేజ్ 1, ఫేజ్2లో ఉన్న టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగిస్తామని ఆయన చెప్పారు. కాలనీలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యల గురించి అధికారులకు వేగుళ్ల పలు సూచనలు చేశారు. తొలుత ఆయన కాలనీవాసుల సమస్యలను సావధానంగా విన్నారు. ఆయన వెంట టిడ్కో ఈఈ రీటా, మండపేట మున్సిపల్ కమిషనర్ బి.రాము తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లను సత్కరించిన కాలనీవాసులు

మండపేట నియోజకవర్గం నుంచి నాల్గవసారి గెలుపొందిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును టిడ్కో కాలనీవాసులంతా సన్మానించారు. జనసేన నాయకుడు శెట్టి రవి సారథ్యంలో కాలనీవాసులు వేగుళ్లకు పూలమాలలువేసి శాలువాలతో సత్కరించారు. తన విజయానికి పనిచేసి తనను గెలిపించిన వారిని వేగుళ్ల అభినందించారు.

పోలీసులకు.. సాయుధ బలగాలకు ఎస్పీ అభినందనలు



అమలాపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి కృషిచేసిన జిల్లా పోలీసు అధికారులకు, సిబ్బందికి, కేంద్ర సాయుధ బలగాలకు ఎస్పీ ఎస్.శ్రీధర్ శుక్రవారం ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రేయింబవళ్లు కృషి చేసిన సిబ్బందిని ఆయన అభినందించారు. కౌంటింగ్ రోజున జిల్లాలో ఎలాంటి హింసాత్మక చర్యలకు, గొడవలకు, అల్లర్లకు తావు లేకుండా ఎప్పటికప్పుడు ఇతర శాఖల అధికారులను సమన్వయపరుచుకుంటూ ముందుకు సాగిన సిబ్బంది చర్యలు ప్రశంసనీయమన్నారు. ఎప్పటికప్పుడు అనుమానితులపై ప్రత్యేక నిఘాను ఏర్పాటుచేసి హోంగార్డు స్థాయి నుంచి అదనపు ఎస్పీ స్థాయి అధికారుల వరకు చేసిన కృషి అభినందనీయమన్నారు. ప్రతీ ఒక్కరు విధుల పట్ల నిబద్ధతతో, సమయస్ఫూర్తితో వ్యవహరించారన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయినప్పటికీ ప్రజల్లో పూర్తిస్థాయి భరోసా కల్పించే లక్ష్యంతో సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాల్లో పోలీసు నిఘా కొనసాగిస్తున్నామన్నారు. కాగా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మండపేట టౌన్‌లో సీఐఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో పలు సమస్యాత్మక గ్రామాల్లో కవాతు నిర్వహించారు. రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో మారేడుబాక నుంచి కలువపువ్వు సెంటర్ వరకు కవాతు నిర్వహించారు. అలాగే అంగర ఎస్ఐ అందే పరదేశీ ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ సిబ్బందితో కపిలేశ్వరపురం మండలం వల్లూరు, కాతేరు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. జిల్లాలో ఎక్కడైనా, ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించి చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. ప్రశాంతంగా ఉండే కోనసీమలో మాటల ద్వారా, చర్యల ద్వారా అనవసరమైన అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ శ్రీధర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.



ప్రకృతి సోయగం..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనంలో శుక్రవారం సాయం సంధ్యవేళ కనిపించిన దృశ్యమిది. సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంది.

- అమలాపురం టౌన్

శస్త్ర చికిత్సా విధానంలో ఫ్యూజ్ కీలకం

జీఎస్ఎల్‌లో ఘనంగా ప్రారంభమైన వర్క్‌షాపు

రాజానగరం, జూన్ 7: శస్త్ర చికిత్సా విధానంలో ఫండమెంట్ యూజ్ ఆఫ్ సర్జికల్ ఎనర్జీ (ఫ్యూజ్)ఎంతో కీలకమని ప్రఖ్యాత అమెరికా వైద్య నిపుణుడు డాక్టర్ జైసా ఓలాస్కీ అన్నారు. రాజా నగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, అమెరికా గాస్ట్రో ఇంటెస్టినల్, ఎండోస్కోపిక్ సర్జన్ల సొసైటీ(ఎస్ఏజీఈఎస్) సంయుక్తంగా జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో రెండురోజుల పాటు నిర్వహించనున్న ఫ్యూజ్ వర్క్‌షాప్ శుక్రవారం ఘనంగా ప్రారంభ మైంది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ జైసా ఓలాస్కీ మాట్లాడుతూ శస్త్రచికిత్సా పరికరాలను సమర్థవంతంగా ఉపయో గించడంలో సాధన అవసరమన్నారు. రోగులకు నిర్వహించే శస్త్ర చికిత్సల్లో ఫ్యూజ్ విధానం వినియోగాన్ని వివరించారు. మరో ముఖ్యఅతిథి న్యూయార్క్‌కు చెందిన డాక్టర్ జాకబ్స్ స్కూల్ ఆఫ్ మెడిసిన్, ప్రొఫెసర్ ఫ్యూజ్ కోర్సు స్థాపకుడు డాక్టర్ స్టీవెన్ షైట్జ్‌బర్గ్ మాట్లాడుతూ ఫ్యూజ్ కోర్సును వినియోగించుకుని రోగుల భద్రత, శస్త్రచికిత్స పనితనం మెరుగుపర్చుకోవాలన్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా నైపుణ్యాలను, జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నూతన కోర్సు మూలాలు, ప్రయోజనాలను వివ రించారు. మరోఅతిథి సట్టర్ ఈస్ట్ బే మెడికల్ గ్రూప్, సాన్ ఫ్రా న్సిస్కో జనరల్ సర్జన్ డాక్టర్ పాస్కల్ ఫుచ్‌షుబెర్, యూనివర్శిటీ ఆఫ్ కొలరెడో హాస్పిటల్, డెన్వర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ సర్జరీ వైద్యులు ఎడ్వర్డ్ జోన్స్, స్టోనీ బ్రూక్ యూనివర్శిటీ హాస్పి టల్ (న్యూయార్క్) జనరల్ సర్జన్ డాక్టర్ కింగా పవర్స్ తదితర సీనియర్ సర్జన్లు ఫ్యూజ్ కోర్సు ప్రాముఖ్యతను వివరించారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో కల్పించిన ఆధునిక సిమ్యులేటర్ పరికరాలు వైద్య విద్యార్థులకు ఎంతగానో దోహపడతా యన్నారు. దీనిపై జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు తమ సంస్థలో నిర్వహించే వివిధ శస్త్ర చికిత్సా పరిక రాలు, శస్త్ర చికిత్సా ఫలితాలను మెరుగుపర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని వివరించారు. రెండు రోజులపాటు జరగనున్న ఫ్యూజ్ వర్క్‌షాప్‌ను ముఖ్యఅతిథి డాక్టర్ జైసా ఓలాస్కీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అతిథులను జీఎస్ఎల్ యాజమాన్యం ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేసింది.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యఅతిథులు

దాస సాహిత్య ప్రాజెక్టు ద్వారా

8,600 భక్తి మండలి గ్రూపులు

● టీటీడీ సాహిత్య ప్రాజెక్టు అధికారి ఆనందతీర్థాచార్యులు



ఆలమూరు, జూన్ 7: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి భక్తిదాసుడైన పురందరదాసు కీర్తనలను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి దాస సాహిత్య ప్రాజెక్టు విశేష కృషిచేస్తోందని, ఇందులో భాగంగా 8,600 మహిళ భక్తిమండలి గ్రూపులు ఏర్పాటు చేశామని దాస సాహిత్య ప్రాజెక్టు అధికారి ఆనందతీర్థాచార్యులు తెలిపారు. ఇందులో 4,500 గ్రూపులు యాక్టివ్‌గా పని చేస్తున్నాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరు విచ్చేసిన ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దక్షిణ భారతదేశంలో దాస సాహిత్యం ప్రాచుర్యం పొందిందన్నారు. పురందరదాసు 4.75 లక్షల సంకీర్తనలు రచించారని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి 46ఏళ్ల క్రితం టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఏర్పాటు చేసిందన్నారు. పురందరదాసు కీర్తనల సారాంశాన్ని వివరించి మండలి గ్రూపులకు నేర్పిస్తామని వివరించారు. కోలాటం ద్వారా కూడా సంకీర్తనలు ఆలపించే విధంగా నేర్పిస్తున్నట్టు చెప్పారు. గుమ్మిలేరులో ఈనెల 6, 7 తేదీల్లో శిక్షణ ఇచ్చామన్నారు. దాస సాహిత్య ప్రాజెక్టుకు తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా ఈ ఏడాది రూ.2.30 కోట్లు బడ్జెట్ కేటాయించారని పీవో ఆనందతీర్థాచార్యులు తెలిపారు. ప్రాజెక్టుకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు బడ్జెట్ పెంచితే దక్షిణ భారతదేశంలో ప్రచారం చేయడానికి వీలుకలుగుతుందన్నారు. గ్రూపులకు పలు ఆధ్యాత్మిక క్షేత్రాల్లో వర్క్‌షాపులు నిర్వహిస్తున్నట్టు వివరించారు. విలేకరుల సమావేశంలో దాస సాహిత్య ప్రాచుర్యకర్త పి.ముకుందేశ్వరస్వామి పాల్గొన్నారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి

రూ.లక్ష విరాళం



పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, జూన్ 7: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం కాతేరుకు చెందిన జి.వెంకట సత్యనారాయణ రూ.1,00,001లు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శనం కల్పించారు.

ఘనం చండీహోమం

రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్ర జపములు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ సిబ్బంది

మామిడికుదురు, జూన్ 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన నేదునూరి శేషగిరి-బేబీఅన్నపూర్ణ దంపతులు శుక్రవారం రూ.1,00,116 విరాళం అందించారు. తమ పెళ్లిరోజైన డిసెంబరు 9న ప్రతి సంవత్సరం అన్నదానం జరిపించాలని కోరారు. దాత దంపతులకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలు అందించి అభినందించారు.

డెల్టా కాలువలకు

6 వేల క్యూసెక్కుల నీరు విడుదల

ధవళేశ్వరం, జూన్7: కాటన్ బ్యారేజ్ నుంచి మూడు డెల్టా కాలువలకు శుక్రవారం 6వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టా ప్రధాన పంట కాలువకు 1000 క్యూసెక్కులు, మధ్యడెల్టా ప్రధాన పంట కాలువకు 1000 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా ప్రధాన పంట కాలువకు 4000 క్యూసెక్కులు చొప్పున సాగునీరు విడుదల అవుతుంది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.65 అడుగులుగా నమోదుకాగా 3141 క్యూసెక్కుల మిగులు జలాలు బ్యారేజ్ నుంచి దిగువకు ప్రవహిస్తున్నాయి.

వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించిన జేడీ విజయ

జీజీహెచ్ (కాకినాడ) జూన్ 7: కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుపుతున్న సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను రాష్ట్ర మహిళా స్కీమ్స్ జాయింట్ డైరెక్టర్ (జేడీ) కె.విజయ శుక్రవారం సందర్శించి అక్కడ రికార్డులను పరిశీలించి బాధితుల వివరాలను తెలుసుకుని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. రాష్ట్రంలోని మహిళలకు సంబంధించిన అన్ని ఇన్‌స్టిట్యూషన్స్ పని తీరును పరిశీలిన నిమిత్తం ఆమె శుక్రవారం జీజీహెచ్‌లోని వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది పనిలో నిబద్ధత కలిగి బాధితులకు అండగా ఉంటూ వారికి శారీరకంగా, మానసికంగా ఏర్పడిన బాధకు శాంత్వన చేకూర్చి వైద్య చికిత్స విషయంలో వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ప్రవీణ, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఆర్.శైలజ పాల్గొన్నారు.

పంపా రిజర్వాయర్ గేట్ల పనితీరుపై ఆందోళన

● పరిశీలించిన ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు

అన్నవరం, జూన్ 7: మెట్టప్రాంత రైతుల వరప్రధాయిని అయిన పంపా రిజర్వాయిర్ గేట్ల పనితీరుపై ఆందోళన వ్యక్తం అవుతుంది. గత ప్రభుత్వ హయాంలో మరమ్మతులకు నిధులు విడుదల చేయకపోవడంతో తాత్కాలిక పనులు చేపట్టి గట్టెక్కించారు. వర్షాకాలం ప్రారంభం కానుండడంతో గేట్ల పరిస్థితిపై శుక్రవారం ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఈఈ శేషగిరి తదితరులు పరిశీలించారు. ప్రధానంగా నాల్గవ నంబరు వరదగేటు గతంలో ఇబ్బంది పెట్టడంతో గేట్ల ఆపరేటింగ్ చేయించి పరిశీలించారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీరు లేకపోవడంతో సులువుగా పైకి కిందకు దిగినా రిజర్వాయర్ నిండితే గేట్లు పైకి లెగడం, కిందకు దిగడం వంటి పరిస్థితులు ఉత్పన్నమవుతాయని సిబ్బంది సూచించారు. రెండ్రోజుల్లో మరోసారి పరిశీలించి అత్యవసరంగా ఉన్న పనులకు నిధులు మంజూరు చేయించి అనంతరం శాశ్వత పనులు చేపడతామని ఈఎన్‌సీ సతీష్‌కుమార్ తెలిపారు. ఇటీవల మరమ్మతులు చేపట్టిన పంటకాలువ గేట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారిణి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



పంపా గేట్లను పరిశీలిస్తున్న ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ తదితరులు

కొనసాగుతున్న

జీర్ణోద్ధారణ పనులు

ఈనెల 17 వరకూ స్వామి దర్శనాలు నిలుపుదల



సామర్లకోట కుమార రామ భీమేశ్వరుడు

సామర్లకోట, జూన్ 7: పంచారామ పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాల యంలో శివలింగానికి జరుగుతున్న జీర్ణోద్ధారణ పనులు ఇంకా నిర్వహించాల్సి ఉన్నందున శివలింగ దర్శనాలు ఈనెల 16వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి బళ్ల నీలకంఠం తెలిపారు. శివలింగ జీర్ణోద్ధారణ పనులు భారతీయ పురావస్తుశాఖ ఆధ్వర్యంలో గతనెల 28 నుంచీ నిర్వహిస్తున్న విషయం విధితమే. ముందుగా ప్రకటించిన మేరకు ఈనెల 8 వరకూ శివలింగ దర్శనా లు నిలిపివేసిన విషయం విధితమే. నిర్దేశించిన మేరకు పనులు పూర్తికానందున 16వరకూ నిర్వహించనున్నందున సంప్రోక్షణ చర్య లు పూర్తిచేసి ఈనెల 17న సోమవారం ఏకాదశి నుంచి గర్భాలయం పునఃర్దర్శనం భక్తులకు ఏర్పాటుచేస్తామని ఈవో తెలిపారు. భక్తులు గమనించి దేవదాయ, భారతీయ పురావస్తుశాఖల అధికారులు చేస్తున్న పనులకు సహకరించాలని ఈవో నీలకంఠం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబా బు, వెంకన్న, అంజిబాబు, శ్రీనివాసరావు, వినయ్ పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

● రూ. 5 లక్షల విలువ గల 3,500 కిలోల బియ్యం, వాహనం పట్టివేత

సామర్లకోట, జూన్ 7: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం ఉండూరు- వీకె.రాయపురం రోడ్డులో ఏపీ 39 యూసీ 2589 అనే మినీ వ్యాన్ వాహనంలో 3,500 కిలోల పరిమాణంలో 70 మూటలుగా కట్టి అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించి సీజ్ చేశారు. రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు పంపిణీ చేసే రేషన్ బియ్యంగా వీటిని నిర్ధారించి అక్రమ తరలింపునకు పాల్పడిన పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడుకు చెందిన బొజ్జా మణికంఠపై 6ఏ చట్టం కింద, క్రిమినల్ కేసులు నమోదు చేయగా అక్రమ తరలింపు వ్యవహారంలో అనుమానితులుగా ఉన్న వారిపైనా కేసులు నమోదు చేశామని విజిలెన్స్ అధికారులు చెప్పారు. అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని సామర్లకోట ఎంఎస్వోకు అప్పగించి వాహనాన్ని సామర్లకోట పోలీసులకు అప్పగించామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ దాడులలో విజిలెన్స్ అధికారులు జగన్నాధరెడ్డి, నవీన్‌కుమార్, జీవానందం, వీరబాబు, సీఎస్‌డీటి కీర్తితో బాటూ రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.



అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృతి

● రూ.5 లక్షల వరకు ఆస్తినష్టం

ఎటపాక, జూన్ 7: వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏర్పాటుచేసిన ఎర్త్ పైపువైరు తగిలి ఐదు గేదెలు మృతి చెందిన సంఘటన శుక్రవారం పురు షోత్తపట్నం పంచాయతీలోని కొల్లుగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. కొల్లుగూడెం గ్రామంలోని గార్లపాటి శాంతారావు, గార్లపాటి రామారావు, గార్లపాటి శ్రీపతి రైతులకు చెందిన నాలుగు గేదెలు, ఒక దూడ మేతకోసం గ్రామశివారులోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ సమీపం వద్దకు వెళ్లాయి. ఈక్రమంలో నెలపై ఉన్న ట్రాన్స్ ఫార్మర్ ఎర్త్ పైపు వైరు తగిలి నాలుగు గేదెలు, ఒక దూడ అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ రూ.5లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు పేర్కొన్నారు. వెటర్నరీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, మృతి చెందిన గేదెలకు పంచనామా నిర్వహించారు.



విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదెలు

రంపచోడవరంలో

227 పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ హవా

● ఏడు మండలాల్లో టీడీపీ, నాలుగు మండలాల్లో వైసీపీ

(రంపచోడవరం)

రంపచోడవరం ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గంలో మూడు ఎన్నికల అనంతరం తెలుగుదేశంపార్టీకి విజయాన్ని కట్టబెట్టిన ఇక్కడి ఓటర్లు ఇక్కడున్న మొత్తం 11 మండలాల్లో ఏడు మండలాలు తెలుగుదేశంవైపు నిలవగా, నాలుగు మండలాలు వైసీపీ వైపు నిలిచాయి. ఈ 11 మండలాల్లో ఉన్న మొత్తం 398 పోలింగ్ కేంద్రాలలో ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్లను పరిశీలిస్తే రంపచోడవరం, దేవీపట్నం, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి, కూనవరం, వి.ఆర్.పురం మండలాలు తెలుగుదేశానికి అండగా నిలిచాయి. ఎటపాక, చింతూరు, మారేడుమిల్లి, వై.రామవరం మండలాలు మాత్రం వైసీపీ పక్షాన నిలిచాయి. అంటే పూర్వపు రంపచోడవరం ఏడు మండలాలలో ఐదు మండలాలు టీడీపీకి, నాలుగు విలీన మండలాలలో రెండు మండలాలు వైసీపీకి దక్కాయి. అనధికార సమాచారం ప్రకారం పోలింగ్ కేంద్రాలలో టీడీపీ, వైసీపీ పార్టీలకు దక్కిన ఓట్లను మండలాల వారీగా విభజిస్తే తెలుగుదేశానికి వచ్చిన 9,015 ఓట్ల మెజారిటీ రంపచోడవరం, దేవీపట్నం, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజఒమ్మంగి, కూనవరం, వి.ఆర్.పురం మండలాల నుంచే దక్కింది. ఇక 398 పోలింగ్ కేంద్రాలలో 228 కేంద్రాలలో టీడీపీ తన ఆధిక్యతను కనబర్చింది.

సర్పంచ్‌కు తెలియకుండా నిధులు విత్‌డ్రా....?

● 15వ ఆర్థిక సంఘం నిధుల్లో గోల్‌మాల్ ?

రాజమహేంద్రవరంరూరల్, జూన్ 7: నిన్నటి వరకు గత ప్రభుత్వానికి కొమ్ముకాసిన పంచాయతీ అధికారులు నేడు మరలా పెత్తనం చెలాయించడానికి, అదే గ్రామాల్లో కొనసాగేందుకు ఇప్పటి నుంచే పైరవీలు మొదలుపెట్టారు. కడియం మండలంలో గ్రేడ్-3 మహిళా కార్యదర్శులు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న గ్రామాల్లో అవినీతికి పాల్పడుతున్నారని పలువురు బాహాటంగా చెబుతున్నారు. బిల్డింగ్ ప్లాన్‌కి సంబంధించి గృహనిర్మాణదారుడు పంచాయతీకి తగిన రుసుము చెల్లించాల్సి ఉంటుంది. గృహనిర్మాణదారుడు చెల్లించిన రుసుములో కొంతమాత్రం సొమ్ముకు చెల్లని రశీదు ఇచ్చి మిగతా సొమ్ములను పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపిస్తున్నారు. మమ్మల్ని ఎవర్రా ఆపేది అంటూ ఇన్నాళ్లుగా మండలస్థాయి రాజకీయ నాయకులను అధికారులను అడ్డుపెట్టుకుని ఇష్టానుసారంగా వ్యవహరించారని ఆరోపణలు లేకపోలేదు. ఎం-బుక్‌లు, బిల్లులపై సర్పంచ్ సంతకం కూడా లేకుండా ఎటువంటి పనులు చేయని వాటికి కూడా అంతా తామై డీఎస్ విధానా(డిజిటల్ సైన్) అడ్డుపెట్టుకుని పంచాయతీకి సంబంధించి 15వ ఆర్థికసంఘం నిధులు అవకతవకలు పాల్పడినట్లు స్వాహా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జిల్లాస్థాయి అధికారులు లోతుగా పరిశీలించి సమగ్ర నివేదిక తయారుచేసి పంచాయతీకి రావాల్సిన నిధులను సమకూర్చి సంబంధిత గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులను చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



eGramSwaraj

Payment Voucher Detail

నిధులు విత్‌డ్రాకు సంబంధించిన వివరాలు



మధురపూడి ఎయిర్‌పోర్టు వద్ద హీరో రామ్‌చరణ్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు

బొబ్బర్లంక-రావులపాలెం మార్గంలో

ట్రాఫిక్ మళ్లింపు

● సినీ హీరో షూటింగ్ నిమిత్తం నేడు, రేపు ట్రాఫిక్ ఆంక్షలు

ఆత్రేయపురం, జూన్ 7: ప్రముఖ సినీ హీరో షూటిం గ్ నిమిత్తం మండలంలోని బొబ్బర్లంక-రావులపాలెం ఆర్ అండ్‌బీ రహదారిలో ఈ నెల 8, 9 తేదీల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్టు రావులపాలెం సీఐ ఎం.రామ్‌కుమార్ తెలిపా రు. బొబ్బర్లంక నుంచి రావులపాలెం వైపు వెళ్లే నాలుగు చక్రాల వాహనాలు, భారీ వాహనాలు, కార్లు, లారీలు, బస్సులు, ట్రాక్టర్లు ధవళేశ్వరం బ్యారేజీని దాటుకుని వేమగిరి, జొన్నాడ మీదుగా రావులపాలెం చేరుకోవాలన్నారు. వాడపల్లి ఆలయానికి ద్విచక్ర వాహనాల్లో వెళ్లవచ్చన్నారు. రావులపాలెం హైవే, వేమగిరి మీదుగా బొబ్బర్లంక చేరుకోవాలన్నారు. ద్విచక్రవాహనచోదకులు బొబ్బర్లంక-రావులపాలెం రహదారి మీదుగా రాకపోకలు సాగించవచ్చని సీఐ చెప్పారు.

గేమ్ చేంజర్ సినిమా సందడి

ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక పరిసర ప్రాంతాలలో హీరో రామ్‌చరణ్ నటిస్తున్న గేమ్ చేంజర్ సినిమా షూటింగ్ సన్నివేశాలు రెండు రోజులపాటు చిత్రీకరించనున్నారు. ఈ షూటింగ్ సన్నివేశాలకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా నిర్వహిస్తున్నారు. అలాగే షూటింగ్ నిమిత్తం హీరో రామ్‌చరణ్ శుక్రవారం రాత్రి రాజమహేంద్రవరంలోని మధురపూడి ఎయిర్‌పోర్టుకు నుంచి బయలుదేరి షెల్టాన్ హోటల్‌కు చేరుకున్నారు.

రేపు పిఠాపురంలో

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ పోటీలు

పిఠాపురం, జూన్ 7: కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈనెల 9న మధ్యాహ్నం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆర్చరీ పోటీలు జరుగుతాయని ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఎస్ఎస్ గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావులు తెలిపారు. పోటీలు అండర్ 10, 13,15 ఏజ్ గ్రూపుల్లో ఇండియన్, రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో జరుగుతాయని చెప్పారు. అండర్ 10 విభాగంలో పాల్గొనే వారు 2015 జనవరి 1 తర్వాత జన్మించిన వారు, అండర్-13లో 2012 జనవరి 1 తర్వాత, అండర్-15లో 2010 జనవరి 1 తర్వాత పుట్టిన వారు అర్హులని వివరించారు. పోటీల్లో పాల్గొనే వారు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వారై ఉండి, ఆధార్‌కార్డు జిరాక్స్, పుట్టినరోజు ధ్రువీకరణపత్రం జిరాక్స్‌లు తీసుకురావాలని తెలిపారు. వివరాలు కోసం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణరావును సెల్: 9989001162లో సంప్రదించాలని సూచించారు.

మధ్యవర్తిత్వ తర్ఫీదు శిక్షణ ముగింపు

● ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వ తర్ఫీదు శిక్షణ శుక్రవారంతో ముగిసిందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత అన్నారు. ఈనెల 3న మధ్యవర్తిత్వ తర్ఫీదు శిక్షణ ప్రారంభించారు. ఢిల్లీ నుంచి వచ్చిన సీనియర్ శిక్షకులు వినయ్‌కుమార్ గుప్తా, సునీల్‌కుమార్ అగర్వాల్ ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన 30 మంది న్యాయాధికారులకు 40గంటల పాటు తర్ఫీదు ఇచ్చారు. ఈ శిక్షణలో నేర్పించిన మెలకువలవల్ల మధ్యవర్తిత్వంలో న్యాయాధికా రులకు మంచి నైపుణ్యం లభించిందని భావిస్తున్నామన్నారు. అనంతరం వినయ్‌కుమార్ గుప్తా, సునీల్‌కుమార్ అగర్వాల్‌ని పీడీజే సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ మృతి

గొల్లప్రోలు రూరల్, జూన్ 7: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కంటైనర్ డ్రైవర్ చికిత్స పొందుతూ మరణించాడు. ఒడిస్సా రాష్ట్రంలోని మహిమాడిపూర్ సమీపంలోని జగత్‌సింగ్‌పూర్ దున్‌షాహి ప్రాంతానికి చెందిన డిబకర్ దాస్ కాకినాడలోని బీ 1కంపెనీలో కంటైనర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాకినాడ జిల్లా తాళ్లరేవు నుంచి రొయ్యలలోడు వేసుకుని భువనేశ్వర్ వెళ్లిన దాస్ అన్‌లోడింగ్ తర్వాత తిరిగి ప్రయాణమయ్యాడు. గొల్లప్రోలు మండలం చేబ్రోలువద్దకు వచ్చేసరికి శుక్రవారం ఉదయం 5గంటల సమయంలో ముందు వాహనం బ్రేక్ వేయడంతో తప్పించబోయి ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దాస్‌కు తీవ్రగాయాలు కాగా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని

దంపతులకు తీవ్ర గాయాలు

ప్రత్తిపాడు, జూన్ 7: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో దంపతులతో పాటు మరో వ్యక్తి గాయపడ్డారు. అన్నవరం నుంచి రాజమహేంద్రవరం బైక్‌పై వెళుతున్న రాజమహేంద్రవరానికి చెందిన దంపతులు ధర్మవరం కోల్డ్ స్టోరేజ్‌వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఈ దంపతులను స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ప్రత్తిపాడుకు చెందిన మరో వ్యక్తి స్కూటీపై రాచపల్లి వెళుతుండగా మినర్వా కళాశాల సమీపంలోని సుద్దగడ్డ వాగు దిగువున అదుపు తప్పి రహదారిపై పడిపోవడంతో తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో స్థానిక ఆసుపత్రికి తరలించారు.



తీవ్రగాయాలైన దంపతులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం



రాజోలు ఎమ్మెల్యే విజేత వరప్రసాద్‌కు లక్ష్మీనరసింహస్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సహాయ కమిషనరు సత్యనారాయణ

వాడపల్లి వెంకన్న ఒక్కరోజు ఆదాయం రూ.2.83 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 7: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామిని శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఒక్కరోజు ఆదాయం రూ.2,83,241 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.





పి.గన్నవరం ఎమ్మెల్యే విజేత గిడ్డి సత్యనారాయణను సన్మానిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, జనసేన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే విజేత సత్యనారాయణకు అభినందనలు తెలుపుతున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

ఎమ్మెల్యే విజేతలకు అభినందన సత్కారాలు

అంతర్వేది, జూన్ 7: భక్తుల కోర్కెలు తీర్చే దేవాదిదేవుడు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి అని ఎమ్మెల్యే విజేత దేవ వరప్రసాద్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తొలిసారిగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం అధికారులు, అర్చకులు పూర్ణకుంభస్వాగతం పలికారు. స్వామి దర్శనం అనంతరం పండితులు, అర్చకులు వేదాశీర్వచనం అందించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని సహాయ కమిషనరు వి.సత్యనారాయణ వరప్రసాద్‌తో పాటు నాయకులకు అందించారు. అనంతరం దేవ ఆలయ తూర్పు భాగంలో ఉన్న స్థలాన్ని పరిశీలించి స్థానిక నాయకులు, అధికారులతో చర్చించారు. స్వామివారిసోదరి అశ్వరూడాంబిక (గుర్రా లక్కమ్మ) ఆలయ రహదారి గురించి ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పోతురాజు కృష్ణ, స్థానిక నాయకులు దేవకు వివరించారు. ఆలయాల అభివృద్ధితో పాటు స్వామివారి తెప్పోత్సవానికి కోనేరు తదితర అంశాలపై అధికారులతో దేవ చర్చించినట్టు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో లింగోలు పెద్దబ్బులు, దిరిశాల బాలాజీ, తాడి మోహన్, బైరా నాగరాజు, ముప్పర్తి నాని, రావూరి నాగు, గుబ్బల ఫణికుమార్, ఉండపల్లి అంజి, ఆకన బాబ్జీనాయుడు, జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తా: ఎమ్మెల్యే విజేత వరప్రసాద్

మలికిపురం, జూన్ 7: రాజోలు నియోజకవర్గంలో అన్ని వర్గాలకు, అన్ని గ్రామాలకు తన హయాంలో సముచిత స్థానం కల్పిస్తానని ఎమ్మెల్యే విజేత దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన్ను ఎల్ఎస్ ల్యాండ్ మార్క్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ ప్రముఖులు కలిసి అభినందించారు. టీడీపీ రాజోలు నియోజకవర్గ సమన్వయకర్త గుండుబోగుల పెదకాపు, రాజోలు మండల శాఖ అధ్యక్షుడు అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, గుబ్బల శ్రీనివాస్, తాడి సత్యనారాయణ, జనసేన నాయకులు రావూరి నాగు, దిరిశాల బాలాజీ, సూరిశెట్టి శ్రీనివాస్, గంటా నాయుడు, ఉండపల్లి అంజి, నాయుడు, జక్కంపూడి శ్రీనివాస్, గుబ్బల రవికిరణ్, బాబూరావు, గుబ్బల ఫణికుమార్ దేవను అభినందించిన వారిలో ఉన్నారు. ఐసీడీఎస్ రాజోలు సీడీపీవో రమాదేవి ఆధ్వర్యంలో సిబ్బంది దేవను అభినందించారు. రాజోలు ఎమ్మెల్యేగా దేవ వరప్రసాద్ అఖండ విజయానికి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సహకరించిన ఎల్ఎస్ ల్యాండ్ మార్క్ అధినేత లింగోలు సత్యనారాయణ (పెద్దబ్బులు)ను టీడీపీ నాయకులు పిండి సత్యనారాయణ, బొక్కా గోవిందు, బళ్ల భాస్కరరావు తదితరులు అభినందించారు.

ఎమ్మెల్యే విజేత గిడ్డికి ఘన సన్మానం

మామిడికుదురు, జూన్ 7: పి.గన్నవరం ఎమ్మెల్యే విజేత గిడ్డి సత్యనారాయణను మగటపల్లిలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, టీడీపీ పార్టీ నాయకులు శుక్రవారం కలిసి ఘనంగా సన్మానించారు. టీడీపీ, జనసేన మండల శాఖల అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజు, నాయకులు ఈలి శ్రీనివాస్, బోనం బాబు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, కడలి నూకరాజు, వర్ధినేని వెంకట్రామయ్య, వాసంశెట్టి శంకరరావు, కొమ్ముల నందిబాబు, నయినాల సత్యనారాయణ మూర్తి, బొక్కా చిన్నా తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: ఎమ్మెల్యే విజేత గిడ్డి సత్యనారాయణను టీడీపీ పరిశీలకుడు షేక్ సుభాన్ పూలమాల, దుశ్శాలువాతో సన్మానించారు. లంకల గన్నవరంలో కూటమి నాయకుల సమక్షంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. జనసేన క్యాంపు కార్యాలయంలో ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు పట్నాల దత్తత్రేయ ఆధ్వర్యంలో సత్యనారాయణను సత్కరించారు. జిల్లా ఇంజనీరింగ్ విభాగం, ఆర్‌డబ్ల్యుఎస్‌లతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యే విజేతను కలిసి అభినంధనలు తెలిపారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పెంటపాటి శ్రీనివాస్, మండల కో-ఆప్షన్ సభ్యుడు షేక్ దొరబాబు, బొడ్డు వెంకట సతీష్, కేదారిశెట్టి ప్రకాష్‌రావు, అప్పన సుబ్రహ్మణ్యం, తమ్మన ప్రసాద్, ముఖరం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విజేత వేగుళ్లకు అభినందనల వెల్లువ

మండపేట, జూన్ 7: మండపేట ఎమ్మెల్యేగా నాల్గవసారి విజయం సాధించిన వేగుళ్ల జోగేశ్వరరావును కలిసి అభినందించేందుకు నియోజకవర్గం నలుమూలల నుంచి కూటమి శ్రేణులు, ప్రభుత్వ శాఖల అధికారులు, డివిజన్ స్థాయి అధికారులు క్యూకడుతున్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయానికి భారీగా తరలివచ్చిన అభిమానులు వేగుళ్లతో కేక్‌లు కట్ చేయించారు. పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, మండపేట అర్బన్, రూరల్ సీఐలు, అఖిల్‌జమా, శ్రీధర్‌కుమార్, మండపేట అర్బన్, రూరల్ కపిలేశ్వరపురం, రాయవరం, ఎస్ఐలు వేగుళ్లను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రాయవరం కపిలేశ్వరపురం, మండపేట మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు పలు కార్యాలయాల సిబ్బంది జోగేశ్వరరావును కలిసి అభినందించారు. వైద్యా శాఖాధికారులు, సచివాలయాల ఉద్యోగులు, వివిధ శాఖల సిబ్బంది, పంచాయతీల కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది, ఉద్యోగులు వేగుళ్లను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.





మలికిపురంలో రాజోలు ఎమ్మెల్యే విజేత వరప్రసాద్‌కు అభినందనలు తెలుపుతున్న వివిధ పార్టీల ప్రముఖులు, మండపేటలో ఎమ్మెల్యే విజేత వేగుళ్ల జోగేశ్వరరావుకు అభినందనలు తెలుపుతున్న రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు



చంద్రబాబు, లోకేశ్‌లను కలిసిన రాజకుమార్ వడయార్

కొత్తపేట, జూన్ 7: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌లను నవ్యాంధ్రప్రదేశ్ అస్థాన శిల్పి, కొత్తపేటకు చెందిన రాజకుమార్ వడయార్ మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందించారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి విజయం పట్ల అభినందనలు తెలిపారు.



ఎంపీ విజేత హరీష్‌మాధుర్‌కు అభినందనలు

రాజోలు, జూన్ 7: అమలాపురం ఎంపీ విజేత గంటి హరీష్‌మాధుర్‌ను మండలంలోని బి.సావరానికి చెందిన మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు జగడం సత్యనారాయణ శుక్రవారం అమలాపురంలో కలిసి అభినందించారు. టీడీపీ నాయకుడు దంతులూరి అచ్యుతరామరాజు, బీసీ నాయకుడు రాయుడు సురేష్ కూడా అభినందనలు తెలిపారు.

‘నీట్‘ ర్యాంకర్‌కు అభినందన

మండపేట, జూన్ 7: పట్టణంలోని 10వ వార్డు కౌన్సిలర్ శిరంగు జ్యోతి తనయుడు మధు సత్యసాయి నీట్ ప్రవేశ పరీక్షలో ఓపెన్ కేటగిరీలో 5,937 ర్యాంకు, జాతీయ స్థాయిలో 13,626 ర్యాంకు సాధించాడు. శుక్రవారం అతడు తల్లిదండ్రులు జ్యోతి-ఈశ్వరరావులతో కలిసి ఎమ్మెల్యే విజేత వేగుళ్ల జోగేశ్వరరావును కలవగా అభినందించారు. సాయికి మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ, మాజీ కౌన్సిలర్లు వాసా రవికిరణ్, బండి గోవిందు, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ఉంగరాల రాంబాబు అభినందనలు తెలిపారు.





శ్రీను చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

శ్రీను మృతికి సంతాపం

మలికిపురం, జూన్ 7: లతా ఎలక్ట్రికల్స్ అధినేత దిబ్బి శ్రీను మృతికి చాంబర్ ఆఫ్ కామర్స్ మలికిపురం సెంటర్లో శుక్రవారం సంతాప సభ నిర్వహించింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చాంబర్ ప్రతినిధులు పళ్లపోతు బంగారం, మిరియాల హనుమంతరావు, గుబ్బల సత్యనారాయణ, ముత్యాల శ్రీను, కంచి జగదీష్, ఆచంట బాబులు, అడబాల హరికృష్ణ, బొల్లం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులతో కలిసి క్యారమ్స్ ఆడుతున్న ఎస్పీ, సీఐ

‘నవ సమాజ నిర్మాణంలో యువత పాత్రే కీలకం’

యానాం, జూన్ 7: నవ సమాజ నిర్మాణంలో యువత పాత్రే కీలకమని, వారు చెడు అలవాట్ల జోలికి వెళ్లి శక్తి, సామర్థ్యాలను నిర్వీర్యం చేసుకోవద్దని యానాం ఎస్పీ రాజశేఖరన్ కోరారు. యువతలో క్రీడా స్ఫూర్తి నింపేలా పుదుచ్చేరి పోలీసు శాఖ నెలలో ఒక రోజు వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం యానాం పోలీస్‌స్టేషన్ ఆవరణలో యువతకు కారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. యువతతో కలిసి ఎస్పీ రాజశేఖరన్, సీఐ షణ్ముగం, ఎస్ఐలు మురుగానందం, శేరు నూకరాజు, జిల్లెల ప్రభాకర్, దాసరి పట్టాభిరామయ్య క్యారమ్స్, చెస్ ఆడారు. ప్రముఖ న్యాయవాది మాజేటి నటరాజన్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

కపిలేశ్వరపురం, జూన్ 7: స్మార్ట్ ఫోన్లకు బానిస కాకుండా, మానసిక ఆరోగ్య సమస్యలకు గురికాకుండా విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం వంగా శ్రీనివాస్ కోరారు. కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం ముగింపు సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యాసరచన, కవితలు, జనరల్ నాలెడ్జ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయం-2 కార్యదర్శి రవితేజ, గ్రంథాలయాధికారిణి డి.శివకుమారి, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ సతీష్, సర్వేయరు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణా శిబిరం

కాట్రేనికోన, జూన్ 7: కాట్రేనికోన శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులందించి ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. గ్రంథాలయాధికారిణి కె.తులసిలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చింతా రాంబాబు, ఎం.మీరాజీ, ఎం.శ్రీనివాస్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సహాయం

కాట్రేనికోన, జూన్ 7: చెయ్యేరులో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన పోలిశెట్టి బుజ్జి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన సత్యలను ముమ్మిడివరం నియోజకవర్గ కాపునాడు కన్వీనర్ నంద్యాల చంటి అభినందించారు. వారికి ఆర్థిక సహాయంతో పాటు నిఘంటువులు బహూకరించారు. కార్యక్రమంలో కాయల బలరాం, అడపా రాము, గాలిదేవర దుర్గేష్, కర్రి లోవరాజు, కానూరి ప్రకాష్, నంద్యాల వికాస్, కూనపునీటి ప్రసాద్, మట్ట శివ, పోలిశెట్టి అంజి పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక

అంబాజీపేట, జూన్ 7: ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాలకు తొండవరం నుంచి ములపర్తి నమిత, ఇసుకపూడి నుంచి జల్లి గ్రేసీ, గంగలకుర్రు నుంచి రావి శైలజఅన్నపూర్ణ, కె.పెదపూడి నుంచి నెల్లి బాలభవాని ఎంపికయ్యారని ఎంఈవో కె.వెంకటేశ్వరరావు తెలిపారు. వారికి 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12వేల చొప్పున ఉపకార వేతనం అందిస్తారు.

బాధితుడికి ఆర్థిక సాయం

రావులపాలెం, జూన్ 7: మండలంలోని పొడగట్లపల్లికి చెందిన జి.శేఖర్‌బాబు కొంత కాలంగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. అతడి కుటుంబ సభ్యులు తమ ఆర్థిక పరిస్థితిని రావులపాలేనికి చెందిన అక్షయ సేవా సంస్థ సభ్యులకు వివరించారు. దీంతో సంస్థ తరఫున రూ.10వేలు, సభ్యుడు సత్తి ఆంజనేయరెడ్డి రూ.1,000 అందజేశారు.

కూటమి విజయంతో సంబరాలు

అమలాపురం రూరల్, జూన్ 7: అమలాపురం ఎంపీగా గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే విజేత అయితాబత్తుల ఆనందరావు విజయం సాధించడంతో కూటమి శ్రేణులు శుక్రవారం సంబరాలు జరిపాయి. బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద గల ఎన్టీఆర్ విగ్రహానికి టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్ ఆధ్వర్యంలో మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. అంబేడ్కర్, బాలయోగి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెనుమాల సునీత-ఏడుకొండలు, మాడా మాధవి, ఆశవ చిన్ని, కాశిన బాబి, బొంతు శ్రీను, బండి సుబ్బారావు, కాశిన ఫణీంద్ర, కొండా సత్యనారాయణరాజు, చింతపట్ల గంగాసత్యనారాయణ, బళ్ల వీర్రాజు, బళ్ల వెంకటేశ్వరరావు, మావూరి శివ, యినుమర్తి సతీష్, జీవరత్నం, కడలి వెంకటేశ్వరరావు, సుభాష్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



అమలాపురం రూరల్ రోళ్లపాలెంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అమలాపురం టౌన్: ఎన్డీయే కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించడంతో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. నేదునూరి నతానియేలు స్వగృహం వద్ద ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ సత్తిబాబుమాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఉత్తర కోస్తా జిల్లాల ఇన్‌చార్జి ముమ్మిడివరపు చినసుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతలు మాదిగ జాతిని గుర్తించి స్థానిక సంస్థల్లో ప్రత్యేక వాటా కల్పించాలని కోరారు. జులై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని వరంగల్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నవరపు భైరవమూర్తి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుమర్తి మోహన్, నాయకులు వీధి చిరంజీవి, లంక రామకృష్ణ, నేదునూరి రాజేష్, పలివెల మోహనరావు, నంద రామకృష్ణ, మల్లవరపు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: ఎన్డీఏ గెలుపు మాదిగల గెలుపు అని ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుడు లూటుకుర్తి చిన్న మాదిగ అన్నారు. కూటమితో పాటు అమలాపురం ఎంపీ, ఎమ్మెల్యేలుగా హరీష్‌మాధుర్, ఆనందరావు ఘన విజయం సాధించడంతో రెల్లుగడ్డలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.



వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు విరాళాలు

ఐ.పోలవరం, జూన్ 7: మురమళ్ల వీరేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు 80 (జి) వర్తింపు రావడంతో భక్తులు విరాళాలిచ్చేందుకు ముందుకు వస్తున్నారని ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కల్యాణ భక్తులకు నూతన భవనంలో నాణ్యమైన అన్నప్రసాదం అందిస్తున్నామన్నారు. వీటీకే రామలింగేశ్వరరావు రూ.50వేలు, ఎస్.నవీన్‌కుమార్ రూ.10,001 విరాళంగా సమర్పించారు. దాతలను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

విఘ్నేశ్వరస్వామికి కొత్తపేట ఆర్డీవో పూజలు

అయినవిల్లి, జూన్ 7: అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని కొత్తపేట ఆర్డీవో వీవీ సత్యనారాయణ దంపతులు శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం వారిని అర్చకులు శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విద్యుత్ శాఖ ఏఈగా మూర్తి

యానాం, జూన్ 7: విద్యుత్ శాఖలో జూనియర్ వున్న ముగ్గాల వీవీ సత్యనారాయణమూర్తికి అసిస్టెంట్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయన్ను ఏఈగా నియమించగా బాధ్యతలు స్వీకరించారు. పరిపాలనాధికారి మునిస్వామిని మూర్తి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.

మురుగు కాల్వ పూడికతీత పనులు

అంతర్వేది, జూన్ 7: సఖినేటిపల్లి మండలం మోరి, మోరిపోడు గ్రామాల్లో ప్రాజెక్టు ఇండియా క్యాంపస్ అండ్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నల్లి సాల్మన్‌డార్విన్ ఆధ్వర్యంలో మురుగుకాల్వ పూడికతీత పనులను శుక్రవారం చేపట్టారు. గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తామని ఆయన చెప్పారు. ఈ నెల 10వ తేదీన కలెక్టర్ గ్రామాలను సందర్శిస్తారని, మురుగుకాల్వల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని నల్లి జోయల్ ఫ్లోరారాణి తెలిపారు.

విద్యుత్ పరికరాల చోరీపై ఫిర్యాదు

అంబాజీపేట, జూన్ 7: వాకలగరువులో పేరాబత్తుల రామ్‌మోహనరావుకు చెందిన రూ.15వేలు విలువైన నాగలి సెట్, పేరాబత్తుల నాగేశ్వరరావుకు చెందిన రూ.18వేలు విలువచేసే విద్యుత్ మోటారును గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకుపోయారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

‘కూటమి విజయానికి కష్టించి పనిచేసిన వారందరికీ గుర్తింపు’

అంబాజీపేట, జూన్ 7: కూటమి విజయం కోసం కష్టించి పనిచేసిన వారిని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు, రాష్ట్ర కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు అంబాజీపేట, పుల్లేటికుర్రుల్లో జరిగిన కార్యక్రమాల్లో అభినందించారు. మాజీ ఎంపీపీ దాసరి వీర వెంకట సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ బొంతు పెదబాబు పుట్టిన రోజు సందర్భంగా పులువురు కూటమి నేతలు శుభాకాంక్షలు తెలిపారు. క్లస్టర్ ఇన్‌చార్జి గణపతి వీరరాఘవులు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, సర్పంచ్ జల్లి బాలరాజు, నాయకులు చిన్నం బాలవిజయరావు, వక్కలంక బుల్లియ్య, రవణం రాము, నేదునూరి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం, జూన్ 7: ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 18వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రభాకర్ తెలిపారు. బీఏ (హిస్టరీ), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ (కెమిస్ట్రీ), బీఎస్సీ (బోటనీ), 15 మేజర్ కోర్సులతో పాటు ఈ ఏడాది బీఎస్సీ (కంప్యూటర్స్ సైన్స్) ప్రవేశపెడుతున్నామన్నారు. నిష్ణాతులైన అధ్యాపకుల పర్యవేక్షణలో తరగతులు నిర్వహిస్తామన్నారు. మరింత సమాచారానికి కళాశాల సిబ్బందిని సంప్రదించాలన్నారు. కళాశాలలోనే దరఖాస్తులను ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేస్తామని ప్రిన్సిపాల్ చెప్పారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: మనమే
శ్రీలలిత	: రక్షణ
శేఖర్ స్క్రీన్-1	: ప్రేమించొద్దు
శేఖర్ స్క్రీన్-2	: బ్యాడ్ బాయ్స్
రమా	: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
గణపతి	: బాక్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సత్యభామ
వెంకటపద్మావతి స్క్రీన్-2	: భజే వాయువేగం